సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 5 । ఆగస్టు । 2023



వీడిన హత్యకేసు మిస్టరీ

మదనపల్లెలో సంచలనం సృష్టించిన అధ్యాపకురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. కుటుంబ కలహాలతోనే హత్య జరిగినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ తెలిపారు. -8లో



రాణించిన సెంట్రల్ జోన్ జట్టు

కడప నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్ జట్టు 52 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1220	రూ.1360
రెండోరకం	రూ.1000	రూ.1200



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 283 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	405	523
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 590.68 కిలోలు

న్యూస్‌రీల్

మహిళా డిగ్రీ కళాశాల పరిశీలన



అధ్యాపకులతో మాట్లాడుతున్న న్యాక్‌పీర్ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీని శుక్రవారం న్యాక్‌పీర్ కమిటీ పరిశీలించింది. కమిటీ చైర్మన్ డాక్టర్ అల్కా మంజల్, సభ్యులు క్రొత్రేష్, డాక్టర్ నీనా సేత్ పజ్నిలు కాలేజీని అన్ని శాఖలను సందర్శించి తనిఖీలు చేశారు. కాలేజీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో వేర్వేరుగా సమావేశమై కాలేజీ స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాక్ కో ఆర్డినేటర్ మోహన్‌బాబు, ఐక్యూసి కోఆర్డినేటర్ విష్ణుప్రియ, అధ్యాపకులు మోహన్‌వల్లి, వనజ, నమ్రత, ఖజావల్లి తదితరులు పాల్గొన్నారు.

నేడు హెచ్‌ఎంలతో సమావేశం

రాయచోటిటౌన్: నాడు - నేడు ఫేజ్-2లో భాగంగా మదనపల్లె నియోజక వర్గ పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం శుక్రవారం పేర్కొన్నారు. అధ్యాపకులు ఉదయం 10గంటలకు రావాలని, రికార్డులు తీసుకరావాలని తెలిపారు.

రైలు బోగీలో పొగలు

పుల్లంపేట: చెన్నై నుంచి మధురైకు బయలుదేరిన మధురై ఎక్స్‌ప్రెస్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి సమీపంలోకి రాగానే జనరల్ బోగీలో పొగలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపేశాడు. దీంతో సుమారు అరగంట పాటు రైలు ఆగింది. ప్రయాణికులు కిందకు దిగారు. బ్రేకులు అరిగిపోవడం వల్ల రాపిడికి గురై కింద మంటలు చెలరేగి..బోగీలో పొగ వచ్చిందని డ్రైవర్ తెలిపాడు.

స్టార్ మిస్ టీన్ ఇండియాగా రాజంపేట అమ్మాయి



ధనూష సాయి దుర్గాచౌదరి

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన వక్కలగడ్డ విష్ణు చౌదరి, ఉత్తరల కుమార్తె ధనూష సాయి దుర్గాచౌదరి స్టార్ మిస్ టీన్ ఇండియాగా ఇంటెలిజెంట్ 2023కు విజేతగా నిలిచింది. ధనూష సాయి దుర్గాచౌదరి(15) విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాజస్థాన్‌లో జరిగిన స్టార్ మిస్ టీన్ ఇండియా ఇంటెలిజెంట్‌లో పలు రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎంతో మందిని దుర్గా ఓడించింది. చక్కటి తెలుగు మాట్లాడటమే కాకుండా, డ్యాన్స్ ట్యాలెంట్, తెలివితేటలు, కమ్యూనిటీ సర్వీస్, ర్యాంప్ వాక్, ప్రశ్న- సమాధానాలు, అద్భుతమైన ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. అన్నమయ్య జిల్లా కాకతీయ సేవా సమితి, కువైట్ కాకతీయ కమ్మ సేవాసమితి, ఆధ్వర్యంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు గొల్లపూడి శివనారాయణ చౌదరి శుక్రవారం ధనూషను సత్కరించి మెమెంటోను అందజేశారు.

జగనన్న సురక్ష.. శ్రీరామ రక్ష

నెల రోజులపాటు జరిగిన కార్యక్రమంలో అధికారులు అనేక కుటుంబాలకు ప్రయోజనాలు అందించారు. ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ మరోవైపు అర్హులుగా ఉండి అందని వారికి ప్రయోజనాలను అందించేలా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఎప్పటికప్పుడే.. అప్పటికప్పుడే సుమారు 11రకాల సర్టిఫికెట్లను అందించి చరిత్ర సృష్టించారు.



రాయచోటిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న కలెక్టర్ పీఎస్ గిరీషా, తదితరులు (ఫైల్)

- నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించిన యంత్రాంగం
- అన్నమయ్య జిల్లాలో 5లక్షలకుపైగా ఇళ్లను కవర్ చేసిన వైనం
- సుమారు 1.96లక్షలకుపైగా సర్టిఫికెట్ల అందజేత

జిల్లాలో సర్వే చేసిన ఇళ్ల సంఖ్య :	5 లక్షలు
ఇప్పటికి నిర్వహించిన క్యాంపులు :	501
అందజేసిన సర్టిఫికెటట్లు :	1,96,603
సమస్యల పరిష్కారంలో సాధించిన శాతం :	99.46

సాక్షి రాయచోటి : రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూన్ నెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జగనన్న సురక్ష ప్రజలకు రక్షగా మారింది. సమస్య ఏదైనా ఆఘమేఘాల మీద పరిష్కారం లభిస్తోంది. సమస్య చెప్పిన వెంటనే సచివాలయం ద్వారా అధికారులకు పంపడం, ఉన్నతాధికారుల పరిశీలన, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణతో గంటల వ్యవధిలోనే దానికి ముగింపు లభిస్తోంది.

- జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలలో మార్పు తీసుకొచ్చింది. దీర్ఘకాలిక సమస్యలతోపాటు సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లాలో ఈ పథకం ద్వారా అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారమయ్యాయి. రోజుల తరబడి కాకుండా గంటల వ్యవధిలోనే 11రకాల సర్టిఫికెట్లకు సంబంధించి జిల్లాలో సర్వే చేసిన ఇళ్ల పరిధిలోని వారికి అందించారు. జిల్లాలోని 500కుపైగా సచివాలయ పరిధిలో 501 జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు.

5లక్షలకుపైగా ఇళ్లు .. 1.96లక్షల మందికి : జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలను ప్రజలకు అందించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 30 మండలాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర స్పెషల్ అధికారులు పర్యటిస్తూ 5లక్షలకుపైగా ఇళ్లను కవర్ చేశారు. అంతేకాకుండా 1,96,603 వివిధ రకాల సర్టిఫికెట్లను అందించారు. జిల్లాలో 99.46శాతంతో మంచి ఫలితాలను రాబట్టారు.

మంచి ఫలితాలను ఇచ్చింది :

అన్నమయ్య జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించారు. నెలరోజులపాటు ప్రత్యేకంగా ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టి ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించడం సంతృప్తిని ఇచ్చింది. జిల్లాలోని అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లడంతోనే ప్రజలకు విస్తత సేవలు అందాయి.

– పీఎస్ గిరీషా(జిల్లా కలెక్టర్), రాయచోటి, అన్నమయ్య జిల్లా

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లా ప్రజలందరిలో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత రెండోసారి జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకోబోతున్నామన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. శకటాలను ఓవరాల్‌గా కోపరేటీవ్, పరిశ్రమలశాఖ జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన ఉండాలని సూచించారు. ప్రభుత్వశాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లేట్‌ను సిద్ధం చేయాలని డీపీఆర్‌ఓను ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి ఈనెల 10వ తేదీలోగా జాబితా పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజకమల్, డిఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- ఆగస్టు 21,22 తేదీలలో జరుగబోవు ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్రకౌన్సిల్‌కు సంబంధించిన గోడపత్రాలను సంఘం నేతలు శుక్రవారం కలెక్టర్ గిరీషా చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఎన్‌జీఓ సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్‌లు మాట్లాడుతూ జిల్లా నుంచి స్టేట్‌కౌన్సిల్ సమావేశాలకు ఉద్యోగులు భారీఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయచోటి ఎన్‌జిఓ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వ రరెడ్డి, లక్కిరెడ్డిపల్లె తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు బలరామరాజు, మల్‌రెడ్డి, నేతలు దేవేంద్ర,మహదేవ, జయప్రకాష్, ప్రసాద్, రామక్రిష్ణ యాదవ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేపట్టాలి

ఓటరు జాబితా పరిశీలనను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా రూపకల్పన తదితర అంశాలపై ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి జాబితా ప్రకారం అన్నీ సక్రమంగానే ఉన్నాయా.. చనిపోయిన వారి పేర్లు, కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఇంటింటి సర్వే నేపథ్యంలో వచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా ఫారం-6,7,8 కింద వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బుధవారం పొలిటికల్ పార్టీలతో మీటింగ్ పెట్టుకోవాలన్నారు. బీఎల్‌ఓలకు రెగ్యులర్‌గా ఓటరు జాబితా తయారీపై శిక్షణ ఇవ్వాలన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి ఎంపీ మిథున్‌రెడ్డి వినతి



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో రహదారి అభివృద్ధి పనులకు సహకరించాలని కేంద్ర జాతీయరహదారులు, రవాణాశాఖమంత్రి నితిన్‌గడ్కరీని ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు.కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో శుక్రవారం ఢిల్లీ పార్లమెంటరీ కార్యాలయంలో సమావేశమైన ఆయన పార్లమెంటరీ పరిధిలోని రహదారి అభివృద్ధి పనులపై చర్చించారు. పలు ప్రతిపాదనలను అందించి, అనుమతులు, నిధులను మంజూరుచేయాలని కోరారు. మదనపల్లె పట్టణాన్ని కదిరి, బెంగళూరు, పలమనేరు రోడ్డులకు కనెక్టివిటీలో భాగంగా పట్టణం చుట్టూ 15.12 కి.మీ. నాలుగులేన్ల బైపాస్ నిర్మాణానికి 2023-24 వార్షికప్రణాళికలో కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులతో పాటుగా రూ.300 కోట్లు నిధులు మంజూరుచేయాలన్నారు. అనంతపురం(ఉరవకొండ) నుంచి కృష్ణగిరి ఎన్‌హెచ్-42 జాతీయరహదారి మదనపల్లె పట్టణం మీదుగా ఏడుకిలోమీటర్లు వెళుతుండటంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్‌జామ్ అవుతోందన్నారు. ప్రయాణసమయం 30నిమిషాలకు పైగా అవుతోందని, నియంత్రించేందుకు 7 మీటర్లు క్యారేజ్‌వే వెడల్పుతో రోడ్డును వెడల్పు చేసేందుకు 7 కిలోమీటర్లకు 2023-24 వార్షికప్రణాళికలో వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద తాత్కాలికంగా రూ.20కోట్లు విడుదలతో పాటు అనుమతులు ఇవ్వాలని కోరారు.పీలేరు పట్టణంలో మదనపల్లె-నాయుడుపేట ఎన్‌హెచ్-71 సుమారు 2.600కి.మీలు వెళుతున్నందున రహదారిపై ప్రయాణసమయాన్ని తగ్గించేందుకు 7 మీటర్ల వెడల్పుతో రోడ్లు వెడల్పుకు రూ.9కోట్లతో అనుమతి, నిధుల మంజూరును కోరారు. 2022-23 వార్షిక ప్రణాళికలో పుంగనూరు పట్టణంలో బైపాస్‌రీచ్ రెండు లేన్ల రహదారిని విస్తరించేందుకు అనుమతులు మంజూరుచేశారన్నారు. దీనిపై కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో ఆంధ్రాకు ప్రత్యేకస్థానం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-23 ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత మెగా టోర్నమెంట్‌కు కడప వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నేషనల్ గేమ్స్‌కు వెళ్లే ఆంధ్రా జట్టును ఈ టోర్నమెంట్ నుంచి ఎంపిక చేయనుండటం శుభపరిణామమన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఎం. ద్వారకనాథ్ మాట్లాడుతూ కడప నగరంలో మరో చక్కటి స్టేడియం అందుబాటులోకి రావడం బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా, అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి సైతం బ్యాడ్మింటన్ రాకెట్ చేతబట్టి కొద్దిసేపు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మెయిన్ డ్రా మ్యాచ్‌లు నిర్వహించారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి నాగరాజు, నెల్లూరు జిల్లా కార్యదర్శి వెంకట్, కర్నూలు కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబు అబద్ధాలకు నిలువెత్తు రూపం: కొరముట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు: అబద్ధాలకు నిలువెత్తు రూపం నువ్వేనని, నీ హయాంలో ఒక్క ప్రాజెక్టయినా తెచ్చావా అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు టీడీపీ అధినేత చంద్రబాబును ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయనేమన్నారంటే.. పద్నాలుగేళ్లు సీఎంగా ఉన్న నువ్వు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా నీటి ప్రాజెక్టులకు కేటాయించలేదు. కానీ.. ఈరోజు నువ్వు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. ఈరోజు నేను అది చేశా.. ఇది చేశా.. అంటూ పెయిడ్ ఆర్టిస్టులను వెంటబెట్టుకుని డప్పులు కొట్టించుకుంటున్నావు తప్ప నువ్వు చేసింది శూన్యం. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయాన్ని పూర్తిగా దెబ్బతీసిన ఘనత నీకే దక్కుతుంది. రాష్ట్రంలో 2024లో జరిగే ఎన్నికల్లో టీడీపీ తరఫున నిలిచేందుకు అభ్యర్థులు కరువవుతారు. ఇకనైనా టీడీపీ నేతలు చిల్లర వేషాలు మానుకోవాలి. గత ప్రభుత్వంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యమయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాతే వర్షాలు పుష్కలంగా పడటం, సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించడంతో రాష్ట్రం సస్యశ్యామలంగా విరాజిల్లుతోంది. ప్రతిపక్షాలు దుష్ప్రచారానికి ఒడిగడుతూ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో తిరిగి సీఎంగా చూడాలని నిర్ణయించుకున్నారు.

రెచ్చగొట్టి..రచ్చ!

- చంద్రబాబు సమీపంలోనే కర్రలు, రాళ్లతో దాడులు
- బాబు రోడ్‌షో ప్రారంభంకాగానే వ్యూహం అమలు



అంగళ్లులో వైఎస్సార్‌సీపీ శ్రేణులవైపు చూస్తూ రెచ్చగొడుతున్న టీడీపీ తమ్ముళ్లు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ ఉనికి కోల్పోతున్న సమయంలో ఆ పార్టీ శ్రేణులు ఎలాగైనా బలం పుంజుకోవాలన్న తాపత్రయంతో దాడులకు తెగబడుతోంది. ప్రత్యర్థి పార్టీ నుంచి ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా ముందస్తు ప్రణాళికలతో అలజడులు సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం కురబలకోట మండలం అంగళ్లలో టీడీపీ అధినేత చంద్రబాబుకు కొద్ది దూరంలోనే తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. పోలీసులను, పోలీసు ఉన్నతాధికారులను లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి రెచ్చిపోయారు. ఇదంతా ముందస్తు వ్యూహంలో భాగంగానే జరిగిందన్న అనుమానాలు బలపడుతున్నాయి. సత్యసాయి జిల్లా కొక్కంటి క్రాస్ నుంచి ములకలచెరువుకు చేరుకున్న చంద్రబాబు క్రాస్‌రోడ్డులో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించే షెడ్యూల్ లేదు. అయితే క్రాస్‌రోడ్డు మధ్యలో ఆగి కారుపై నుంచి మాట్లాడారు. ప్రసంగ ప్రారంభమే స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై ఆరోపణలు చేశారు. ములకలచెరువు నుంచి నాయనచెరువుపల్లె వెళ్లి అక్కడి నుంచి బి.కొత్తకోట మండలంలోని ఖానీతోపు వద్ద జాతీయరహదారిపై పుంగనూరు ఉపకాలువను పరిశీలించి, అక్కడే రైతులతో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు చంద్రబాబు ఇక్కడి కార్యక్రమాలను రద్దు చేసుకుని నేరుగా అంగళ్లకు బయలుదేరారు. మధ్యాహ్నం 3.25 గంటలకు అంగళ్లకు చేరుకుని కారుపై నుంచి రోడ్‌షో మొదలు పెట్టారు. చంద్రబాబు రోడ్‌షో మొదలు పెడితే తెలుగు తమ్ముళ్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వ్యూహాత్మక దాడులు మొదలు పెట్టారు.దీనికి వంద మీ టర్ల దూరంలోనే చంద్రబాబు రోడ్‌షో వస్తోంది. ఈ కార్యక్రమంలో శాంతిభద్రలకు విఘాతం కలగకుండా డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు విధుల్లో ఉన్నారు. అంగళ్లు కూడలికి సుమారు 500 మీటర్ల దూరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు. చంద్రబాబు కార్యక్రమానికి వచ్చిన టీడీపీ శ్రేణులే ఎక్కువ. అలాంటప్పుడు వైఎస్సార్‌సీపీ శ్రేణులు దాడులు చేసే అవకాశమే లేదు. అయితే టీడీపీ తమ్ముళ్లు పోలీసుల సాక్షిగా రెచ్చిపోయారు. ఈలలు, కేకలు వేస్తూ, తొడలు కొడుతూ, రాళ్లు, కర్రలతో ఊగిపోతూ పోలీసులను నెట్టేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పరిగెత్తారు. పోలీసులూ వీరిని అడ్డుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇంత జరిగినా తప్పంతా వైఎస్సార్‌సీపీ శ్రేణులదే అన్నట్టు టీడీపీ అధినేత చంద్రబాబు తమ్ముళ్లను వెనకేసుకొచ్చారు. వారిని కనీసం మందలించలేదు. ఇంకా పోలీసులను అసమర్థులుగా పేర్కొన్నారు. తెలుగు తమ్ముళ్లు కావాలనే వైఎస్సార్‌సీపీ వర్గీయులను రెచ్చగొట్టి పథకం ప్రకారం రచ్చ చేశారని తెలుస్తోంది.

పథకం ప్రకారం టీడీపీ దాడి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లులో శుక్రవారం జరిగిన సంఘటన దురదృష్టకరమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. హుటాహుటిన అంగళ్లు చేరుకుని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు పథకం ప్రకారం రౌడీలు, గూండాలను వెంట తెచ్చుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారన్నారు. మరో వైపు మారణాయుధాలతో కూడా వాహనాల్లో వచ్చారన్నారు. ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితుల పరిహారం కోసం రూ.100 కోట్లు కూడా విడుదలైందన్నారు. పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఈ రిజర్వాయర్ పనులు ఎందుకు ఆపించారన్నారు. ఎందుకు ఇలా చేశారని అడగటానికి వచ్చిన వారిపై రాళ్లు, కట్టెలతో దాడులు చేయిస్తారా అని ప్రశ్నించారు. 'ఎన్నికల్లో చంద్రగిరిలో నిలుస్తావా..తంబళ్లపల్లెలో నిలుస్తావా మీపై నేనే పోటీ చేస్తా మీరు సిద్ధమా' అని బాబుకు సవాల్ విసరారు.

ఏ మొహం పెట్టుకుని వచ్చావ్...బాబు

సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంటూ..మళ్లీ ఏ మొహం పెట్టుకుని వచ్చావు చంద్రబాబు అంటూ వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి, అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం అంగళ్లలో జరిగిన సంఘటనపై వారు విచారం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలబడిన వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించినా టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టడం, కవ్వింపు చర్యలకు పాల్పడమే కాకుండా రాళ్లు, కట్టెలతో దాడులకు ఎగబడటం దురదృష్టకరమన్నారు.

పాలకులు బాగుంటేనే రాజ్యం సుభిక్షం



వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

రైల్వేకోడూరు: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు పడక కరువు తాండవించేదని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినాటి నుంచి వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయన్నారు. పాలకులు బాగుంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందనే దానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సలహాదారులు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యానకళాశాలను జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ సి.హెచ్.రూత్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఉద్యానకళాశాల అన్నమయ్య జిల్లాకు తలమానికంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని దోస, మామిడి, చీని, ఔషధ మొక్కలు, నర్సరీలను పరిశీలించారు. రైల్వేకోడూరు ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచిందని, మరో కోనసీమగా వెలుగొందుతోందన్నారు. . అనంతరం కోడూరు పట్టణంలోని అగ్రిల్యాబ్‌ను, ఆర్బీకేలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, సీనియర్ శాస్త్రవేత్త స్వరాజ్యలక్ష్మి , ఉద్యానశాఖ అధికారి ఆషియా, కోడూరు ఉప సర్పంచ్ తోట సాయి, డైరెక్టర్ ప్రశాంతి రమేష్, ఆర్.వి.రమణ, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, సుబ్రమణ్యం, చంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలి నుంచి వేలిముద్ర తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్

వాల్మీకిపురం : వలంటీర్లు పరిధి దాటి సేవలందిస్తూ ఔరా అనిపిస్తున్నారు. మండలంలోని చింతపర్తికి చెందిన నవనీతమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ తిరుపతి టాటా క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు సాకీబ్, వలంటీర్ గోవర్ధన్ తిరుపతిలో ఆసుపత్రికి చేరుకొని, ఆమెకు పింఛన్ అందజేశారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

హుండీల్లో నగదు చోరీ



ఆలయం వెనకల వైపు పడేసిన హుండీ

ములకలచెరువు : స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలోని మూడు హుండీల్లో ఉన్న నగదును గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీ చేశారు. హుండీలలోని సొమ్ము తీసుకొని, వాటిని ఆలయం వెనకల వైపు పడేశారు. సుమారుగా రూ.15 వేల వరకు నగదు ఉంటుందని ఆలయ ధర్మకర్తలు శుక్రవారం తెలిపారు. ఇప్పటికి రెండు సార్లు హుండీల చోరీ జరిగినట్లు, చోరీలను అదుపుచేయాలని వారు కోరుతున్నారు.

రూ.1.15 లక్షల నారు నష్టం

కలికిరి : పట్టణ పరిధిలోని పీలేరు రోడ్డు నగిరిపల్లి క్రాస్ వద్దనున్న నర్సరీ వాటర్ ట్యాంక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు విషపూరిత మందు కలపడటంతో సుమారు రూ.1.5 లక్షల విలువ చేసే టమాట నారు చనిపోయినట్లు నర్సరీ యజమాని ఎస్.రమణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 2న ట్యాంక్‌లో మందు కలిపారని, 3న నారుకు నీరు పట్టడంతో పూర్తిగా నాశనమైందని ఆయన పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

వీడిన హత్యకేసు మిస్టరీ

- కుటుంబ కలహాలతోనే అధ్యాపకురాలి హత్య
- ముగ్గురు హంతకుల అరెస్ట్
- ఎస్పీ గంగాధరరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన అధ్యాపకురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. భర్త, అతడి ఇద్దరి భార్యల మధ్య తగాదాలు, కుటుంబ కలహాలతోనే లెక్చరర్ రుక్సానా హత్య జరిగినట్లు ఎస్పీ గంగాధరరావు వెల్లడించారు. హత్య చేసిన హంతకుల్లో రుక్సానా భర్త ఖదీర్‌అహ్మద్ రెండోభార్య ఆయిషా ఇద్దరు తమ్ముళ్లు, వారి స్నేహితుడిగా నిర్ధారించారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప, సీఐ మురళీకృష్ణతో కలిసి ఎస్పీ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన ఎస్.కే.ఖాదర్ అహమ్మద్ కుమారుడు ఖదీర్ విద్యుత్ సంస్థలో డ్యూటీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. 2022 మార్చి 29న పట్టణంలోని వెంకటేశ్వరపురానికి చెందిన గౌస్‌పీర్ కుమార్తె ఆయిషాను పెళ్లి చేసుకున్నాడు. అయితే ఖదీర్‌కు అప్పటికే మదనపల్లె మండలం బీకే.పల్లె పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన మహమ్మద్ అలీ కుమార్తె రుక్సానాతో 2017లో పెళ్లి జరిగింది. ఈ విషయాన్ని దాచిపెట్టి ఖదీర్.. ఆయిషాను వివాహం చేసుకోవడంతో, తనను మోసం చేశారంటూ భర్త, అతడి మొదటిభార్య రుక్సానా, వారి కుటుంబ సభ్యులపైన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయిషా ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయిషా పుట్టింటిలో ఒంటరిగా ఉండటం, భర్తకు తమ చెల్లెలు దూరంగా ఉండటాన్ని భరించలేక ఆమె, ఇద్దరు అన్నదమ్ములు షేక్‌ప్యారేజాన్, సులేమాన్, వీరి స్నేహితుడు షేక్ అహ్మద్‌లు మొదటి భార్య రుక్సానాను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కత్తులను కొనుగోలు చేసి, రుక్సానా కదలికలపై నిఘా ఉంచి పలుమార్లు రెక్కీ నిర్వహించారు. రుక్సానా పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పని చేస్తుండటం, ప్రతిరోజు ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వెళుతుందన్న విషయాన్ని తెలుసుకున్నారు. కళాశాల నుంచి ఇంటికి వెళ్లే ప్రశాంత్‌నగర్‌లోని సిద్ధార్థకాలేజి వీధి తమ పథకానికి అనుకూలంగా ఉంటుందని భావించి సాయంత్రం 5.10 గంటల సమయంలో కాపుకాశారు. ఆయిషా తమ్ముడు సులేమాన్, అతని స్నేహితుడు షేక్ అహ్మద్‌లు ఇంటికి వెళుతున్న ఆయిషాను అడ్డగించి, కళ్లలో కారంచల్లి.. ఆమె మెడపైన కత్తితో పలుమార్లు క్రూరంగా పొడిచి చంపారు. తర్వాత తాము వచ్చిన టువంటి మోటార్‌సైకిల్‌లో పారిపోయేందుకు ప్రయత్నించగా, అది స్టార్ట్ కాకపోవడంతో దానిని అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నేర స్థలంలో సీసీ పుటేజి, హంతకులు వదిలేసి వెళ్లిన వాహనం, సాంకేతికత సహాయంతో పట్టణంలోని మూడుస్టేషన్‌ల సీఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. శుక్రవారం ఉదయం పోలీసులకు వచ్చిన రహస్య సమాచారం మేరకు టమాటా మార్కెట్ వెనుకవైపున నిందితులను అరెస్ట్ చేశారు. నేరంలో ఉపయోగించిన రెండు కత్తులు, ఒక మోటార్‌సైకిల్, రక్తపుమరకలు కలిగిన రెండుచొక్కాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పాత నేరస్తులుగా ఉన్నారు. కేసు విషయమై సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నామని, నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు విచారణలో ఇంకా ఎవరైనా నిందితుల ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



వీరయ్య (ఫైల్)

కలికిరి : కలికిరి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నడిచి వెళుతున్న జరుగుమల్లి వీరయ్య(47)ను పల్లవోలు గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో వినయ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడి కోమా స్థితిలో ఉన్న వీరయ్యను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నెల రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు మృత్యుఒడిలోకి చేరాడు. మృతదేహానికి కలికిరి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య భాగ్యమ్మ, కుమార్తె జీవ జ్యోతి, కుమారుడు లోకేష్ వున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సాహితీవేత్త జరుగుమల్లి వీరయ్య మృతి సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలికిరి ప్రభుత్వాసుత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం త్వరితగతిన అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కొటాల వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటపతి తదితరులు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ



మృతి చెందిన రవళి

ఓబులవారిపల్లె : పుల్లంపేట మండల పరిధిలోని సీతారాంపేట జాతీయ రహదారిపై ఆటోను లారీ ఢీకొనడంతో యువతి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట మండలం బోయనపల్లె నుంచి పి.రవళి(28), భర్త నరసింహులు, బంధువులు హరికృష్ణ, మహేంద్రలతో కలిసి ఆటోలో ఓబులవారిపల్లె మండలం గొబ్బూరువారిపల్లి గ్రామానికి బయలుదేరారు. సీతారాంపేట వద్దకు రాగానే ఆటోను లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రవళిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందిది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : దళిత కుటుంబానికి న్యాయం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధీర్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన రాయచోటిలో కలెక్టర్ గిరీషా పీఎస్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్రంకొండ పంచాయతీలోని పాత ఇందిరమ్మ కాలనీకి చెందిన దళితుడు బుడ్లపల్లె కదిరయ్యకు 1971లో అప్పటి ప్రభుత్వం సర్వేనంబర్ 522/3లో 1.4 సెంట్ల డీకేటీ భూమిని మంజూరు చేసిందన్నారు. అయితే అదే పంచాయతీకి చెందిన రహంతుల్లా కుటుంబీకులు.. కదిరయ్యను సదరు భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటూ దౌర్జన్యం చేశారన్నారు. అనంతరం కదిరయ్య మనువడు రెడ్డెయ్యను సైతం భూమిలోకి రానివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంపై కదిరయ్య కుటుంబం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కావున మీరైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాణించిన సెంట్రల్ జోన్ జట్టు



క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న సౌత్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ జోన్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 38.3 ఓవర్లలో 154 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నయాముల్లా 31 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్లు ఆదిత్యారెడ్డి 4, గీత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.కె.మహమ్మద్ తౌఫిక్ 62, అభినవ్ 53 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు సాయిఅర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్‌జోన్ జట్టు 52 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.



తౌఫిక్, (62 పరుగులు)



ఆదిత్యారెడ్డి, (4 వికెట్లు)

హ్యూమన్ రైట్స్ అడ్వైజర్‌గా లక్ష్మీనారాయణ



రాజంపేట : మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫ్పెర్స్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, నీతి అయోగ్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా (గుర్తింపు పొందిన) ఏర్పడిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ శాఖకు చీఫ్ లీగల్ అడ్వైజర్‌గా రాజంపేటకు చెందిన తరిగోపుల లక్ష్మీనారాయణను ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ నియామకం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీ నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడడం.. నేరాలు, హింస, అవినీతికి వ్యతిరేకంగా పోరాడడమే కాక అలా చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలని చెప్పవచ్చని తెలిపారు. అవగాహన ఉన్నంత మేర సమాజంలో వీటి వలన జరిగే నష్టాల గురించి ప్రజలకు వివరించి, సమాజ మార్పు కోసం ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

గాలివీడు మండలంలో కేంద్ర బృందం



కేంద్ర బృందం సభ్యులతో మండల అధికారులు

గాలివీడు : స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కింద ఎంపికైన మండలంలోని గరుగుపల్లె, ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీలలో శుక్రవారం కేంద్రం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ క్లినిక్, మసీదు, దేవాలయం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా, వాటిని ఉపయోగిస్తున్నారా లేదా.. మల,మూత్రశాలకు పోయి వచ్చిన తరువాత చేతులు శుభ్రం చేయుటకు సబ్బు లేక హ్యాండ్ వాష్‌ను వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. పరిశుభ్రతను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేంద్రం బృందం సభ్యులు చెన్నకేశవరెడ్డి, సుశాంత్, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, సర్పంచ్‌లు మల్లికార్జుననాయుడు, జానికి రామాంజులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి నిధులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్ : జిల్లాలోని వైద్యులు, ఉద్యోగులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య కోరారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల సీనియర్ అసిస్టెంట్లకు హెచ్‌డీఎస్ నిధుల వినియోగంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ప్రతి నెలా రెండవ సోమవారం ప్రొటోకాల్ ప్రకారం సీనియర్ అసిస్టెంట్లే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించి మినిట్స్ అన్నింటిని పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కమిటీ చేసిన తీర్మానాలను అమలు జరిగేలా నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రోగులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్‌ఎం నిధులను విడుదల చేస్తున్నాయన్నారు. ఇన్‌చార్జి ఏఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రతి నెలా ఖర్చు చేసిన మొత్తానికి రశీదులు ఆ నెలవారి సమావేశంలో సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ జన ఆరోగ్యసమితి, విలేజ్‌హెల్త్ న్యూట్రిషన్ కమిటీ, హెచ్‌డీఎస్ కమిటీలను ఎలా ఏర్పాటు చేసుకోవాలి? సమావేశాలను ఎలా నిర్వహించుకోవాలి? ఖాతాలు బ్యాంకులో ఎలా ఓపెన్ చేసుకోవాలి ? నిధులు ఎలా ఖర్చుచేయాలి? ఓచర్లు ఎలా తయారు చేయాలి? ప్రతి నెలా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రిపోర్టు ఎలా తయారు చేసి పంపాలన్న విషయాలను క్షుణ్ణంగా వివరించారు. జాతీయ ఆరోగ్యమిషన్ కింద పని చేస్తున్న ఉద్యోగుల హాజరు ప్రతి నెలా 21వ తేదీలోపు ఎన్‌హెచ్‌ఎం సెక్షన్‌కు పంపాలని, ఎన్‌హెచ్‌ఎం నిధుల ఖాతాల నిర్వహణ, పర్యవేక్షణ ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌హెచ్‌ఎం అకౌంట్స్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా 21వ తేదీలోపు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రిల నుంచి హాజరును పంపగలిగితేనే 1వ తేదీన ఉద్యోగుల ఖాతాలలో జీతాలు జమచేయవచ్చునన్నారు. సమావేశంలో జిల్లాలోని 47 పీహెచ్‌సీలు, 11 సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆ అధ్యాపకుడిపై చర్య తీసుకోవాలి



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులు

పీలేరు : విద్యార్థిని చితకబాదిన అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్‌తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డుపై విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రయాన్ ఆడుకుంటూ పక్కనే ఉన్న కళాశాల గోడపై రాయి వేయడంతో ఆగ్రహించిన తెలుగు అధ్యాపకుడు మురళి.. కళాశాలకు పిలిపించి చితకబాదడం హేయమైన చర్య అన్నారు. విద్యార్థి కుప్పకూలిపోయి కింద పడడంతో ప్రభుత్వాస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

కడప అర్బన్ : చెన్నూరు మండలం గోపవరం–చెన్నూరు రోడ్డులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి, అదనపు ఎస్పీ షేక్ మాసుంబాష ఆదేశాల మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. చిలమకూరి పాపయ్యగారి షెడ్డు వద్ద లారీలో రేషన్ బియ్యం అక్రమంగా లోడ్ చేసి రవాణాకు సిద్ధంగా వుందనే సమాచారంతో తనిఖీలు చేశారు. ఆ లారీలో వివిధ రంగుల్లో వున్న ప్లాస్టిక్ సంచులలో గల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. మొత్తం 415 బస్తాల బియ్యం, బొలేరో వాహనం, లారీని సీజ్ చేశారు. బొలెరో వాహనం ద్వారా చెన్నూరు చుట్టు పక్కల గ్రామాల నుంచి సేకరించి అక్రమంగా రవాణా చేయుటకు సహకరిస్తున్నారు. బొలేరో, లారీతోపాటు రేషన్ బియ్యం మొత్తం విలువ సుమారు రూ.21,43,280 ఉంటుంది. వీటిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నూరుకు చెందిన లారీ డ్రైవర్ బ్రహ్మయ్య, లారీ క్లీనర్ కొట్టాల నూర్‌బాష, బొలెరో డ్రైవర్ కొండు రామకృష్ణలను అరెస్ట్ చేశారు. లారీ ఓనర్ ప్రొద్దుటూరుకు చెందిన మహబూబ్‌బాషాతోపాటు, పై ముగ్గురిపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులైన ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాష, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ.బాలగంగాధర్‌రెడ్డి, కడప సిఎస్‌డిటి పి.ఎం.వి మనోజ్, ఉప్పరపల్లి విఆర్‌ఓ పి.వెంకట సుబ్బయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జనార్ధన్‌రావు, కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, రంతుబాషలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం



ఈశ్వరరెడ్డి (ఫైల్)

మదనపల్లె : ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రైలు కిందపడి దుర్మరణం చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె మండలంలోని సీటీఎం రైల్వేస్టేషన్‌లో జరిగింది. కదిరి రైల్వేపోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా తెలిపిన మేరకు వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ముష్టూరు పంచాయతీ రాఘవంపల్లెకు చెందిన బోరెడ్డి ఈశ్వరరెడ్డి(52) ప్రైవేటు వాహనాల డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి ధర్మవరం నుంచి పాకాలకు రైలులో ప్రయాణమయ్యాడు. తిరుపతిలో ఉన్న బొలోరో వాహనాన్ని తెచ్చేందుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పాడు. తను ప్రయాణిస్తున్న కదిరిదేవరపల్లె–పాకాల రైలు సీటీఎం రైల్వేస్టేషన్ చేరుకోగా, ఎదురుగా వచ్చిన మరో ప్యాసింజర్ రైలుకు అక్కడ క్రాసింగ్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రెండవ ప్లాట్‌ఫారంలోని రైలులో ఉన్న ఈశ్వరరెడ్డి ప్రమాదశాత్తు కిందపడటం, రైలు అతని మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున గమనించిన రైల్వే సిబ్బంది కదిరి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య కాంతమ్మ, కుమార్తె భవాని, కుమారుడు సాయిక్రిష్ణారెడ్డిలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

– బాలుడి మృతి, ఇద్దరికి గాయాలు



మృతి చెందిన కీర్తన్

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని కొర్లకుంట జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం, కారును ఢీకొనడంతో బాలుడు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేకోడూరు పట్టణానికి చెందిన మస్తాన్ తన ఇద్దరు కుమారులు కీర్తన్, ఓబులేసుతో అత్తగారి ఊరు మటమంపల్లెకు కారులో వెళ్తుండగా.. కొర్లకుంట జాతీయ రహదారి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని వేగంగా వెళ్లిపోయింది. కారు బోల్తా పడటంతో కీర్తన్(15) తలకు తీవ్రమైన గాయం కాగా మస్తాన్, ఓబులేసుకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కుక్కపిల్ల అడ్డు రావడంతో..

– ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

గాలివీడు : కుక్క పిల్ల అడ్డురావడంతో.. ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గాలివీడు నుంచి గోరాన్‌చెరువుకు బేల్దారి పని నిమిత్తం కూలీలు ఆటోలో వెళ్తున్నారు. అదే మార్గంలోని గోపనపల్లె వైపు నుంచి గాలివీడుకు ద్విచక్ర వాహనం వస్తోంది. మండల కేంద్రంలోని కేకే వాటర్ ప్లాంట్ సమీపంలో రాగానే కుక్కపిల్ల అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయి ఈ రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలానికి చెందిన ఆటో డ్రైవర్ తిమ్మరాజు, గోపనపల్లెకు చెందిన స్కూటరిస్టు షఫి తీవ్రంగా గాయపడ్డారు. కుక్కపిల్ల అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూటరిస్టును మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు.

గృహిణి ఆత్మహత్య



పూజిత మృతదేహం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు పంచాయతీ మిట్టపల్లెకు చెందిన మంజునాథ భార్య పూజిత(22) బంగారు చైను కొనివ్వాలని ఇంట్లో మామ వెంకటరమణను అడిగింది. కొనివ్వకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.